
పరమహంస చచ్చిపోయాడు.
కానిస్టేబుల్ పరమహంస దీనాతి దీనంగా, ఘోరాతి ఘోరంగా, హీనాతి హీనంగా పోయాడు. అత్యంత చౌకబారుగా, అడుక్కునే వాడి చేతిలో అర్ధరాత్రి అసువులు బాశాడు. ఫుట్ పాత్ మీద అడ్డంగా బోర్లాపడి వుంది శవం. టాటా సుమో ఇంకా ఆగకుండానే దూకి వచ్చాడు డీసీపీ తాండవ్. గౌరవ సూచకంగా తన ‘టోపీ’ తియ్యబోయాడు. దాని మీద వున్న మూడు సింహాలూ గర్జించటం మాని, ముక్తకంఠంతో ‘మ్యావ్’ మన్నట్లు అనిపించింది



# ‘ఫుడ్’ పాత్

## సతీష్ చందర్

‘ఛీ...ఛీ...’ అనుకుని మళ్ళీ తల మీద పెట్టేసుకున్నాడు.

‘ముఖం చూస్తారా సార్! గుర్తు పట్టకుండా నుజ్జు నుజ్జు చేశాడు సార్’, వెంట ఆయనకన్నా ముందుగా దూకి ఎదురుగా నిలబడ్డ ఇన్స్పెక్టర్ చెప్పాడు.

‘రాయి సార్... మామూలు బండ రాయితో చంపేశాడు’. ఇంకొక ఇన్స్పెక్టర్ చెప్పాడు.

అసహనంతో, కోపంతో ఉడుక్కుంటున్న డీసీపీ తాండవ్ అలవాటు ప్రకారం కుడిచేత్తో మీసాలు మెలివేసి..... ‘పోయింది పోలీసు పరువే’నని స్ఫురణ కొచ్చి సాపు చేసేశాడు.

అప్పటికే పది మంది కానిస్టేబుళ్ళు బిచ్చగాణ్ణి ఉతికేసి,అరేసే స్థలం కోసం ఎదురు చూస్తున్నారు. బిచ్చగాడు నడవలేక పోతున్నాడు. కానీ నవ్వగలగుతున్నాడు.

డీసీపీ వాడి మీదకి ఉరకబోయాడు... కానీ తమాయించుకున్నాడు. దర్యాప్తుకు వాడి నవ్వు కూడా పనికొచ్చేలా వుంది.

విద్యుద్దీపం వెలుగులో, కాళ్ళ దగ్గర బిచ్చగాడినీ, ఫుట్ పాత్ మీద కానిస్టేబుల్ పరమహంస శవాన్నీ మార్చి మార్చి చూశాడు డీసీపీ తాండవ్. చనిపోయిన పరమహంసకు ముఖమే లేదు. బిచ్చగాడికి ముఖమున్నా అది ముఖం కాదు.

అంత వెలుతురులోనూ బిచ్చగాడిది ముఖమని చెప్పటానికీ రెండే రెండు ఆధారాలు కనిపిస్తున్నాయి. గుంటల్లో మెరిసిన, కళ్ళూ, గారపట్టిన పళ్ళూ...! (వాడు నవ్వకపోతే బయటపడేవి కావు.)

‘ఇప్పుడు విసిరెయ్యండి’ అన్నాడు తాండవ్ ఊగిపోతూ.

అంతే...! ఉతికిన బిచ్చగాణ్ణి పైకెత్తి పోలీస్ వ్యాన్‌లోకి అరేసారు.

‘వాణ్ణికూడా!’ అంటూ టాటా సుమో

ఎక్కేశాడు డీసీపీ తాండవ్ పరమహంస శవంవైపు అసహ్యంగా చూస్తూ.

కానీ, పరమహంస శవాన్ని పదిలంగానే ఎత్తు కెళ్ళి, వ్యాన్‌లో పడుకోబెట్టారు కానిస్టేబుళ్ళు.

వ్యాన్ కదిలింది. శవాన్ని చూస్తూ బిచ్చగాడు నవ్వును పెద్దది చేసుకున్నాడు. తనని తాను కవ్విం చుకుంటూ, రెచ్చగొట్టుకుంటూ కులుకుతున్నాడు.

లాఠీల దెబ్బలకూ ఒళ్ళంతా సలుపుతున్నా.. హాయిగా వుంది. సుఖంగా వుంది. సమ్మగా వుంది.

అదో విలాసం. ఇన్నాళ్ళూ ఆకలి తీరినప్పుడు మాత్రమే ఆ ఆనందం కలిగేది. ఇప్పుడు పగ తీరాక కూడా కలుగుతోంది.

పగ కూడా ఆకలే.

నెల రోజుల పగ పది నిమిషాల్లో తీరిపోయింది బిచ్చగాడికి.

మనసంతా పరమ అహింసాయుతంగా వుంది. అనుకున్న హింస చేసేశాక ఎవడయినా అహింసా వాదే. ఇప్పుడిక చీమను చంపమన్నా చంపలేడు. అందుకే... వొంటి మీద అన్ని లాఠీలు పడ్డా... ఉలక లేదు. పలక లేదు. అసలు తన శరీరం తనదను కుంటే కదా!

'ఇలాంటప్పుడు... ఒక్క బీడీ వెలిగిస్తే... అబ్బో!... ఆ భోగమే వేరు!' అనుకున్నాడు. కానీ.. తన చేతులకు బేడీలు...!

అంత తృప్తిలోనూ... చిన్న అసంతృప్తి. అది నచ్చలేదు.

అందుకే గంట క్రితంలోకి వెళ్ళిపోయాడు.

***

పదకొండు గంటలు. డిశంబరు 31. ఇప్పుడు పన్నెండు దాటిపోయింది. అంటే తనని పోలీసులు చితక్కొడుతున్నప్పుడు సరిగ్గా పన్నెండు గంటల య్యివుండాలి

తాను గత ఏడాది బిచ్చగాడు. ఈ ఏడు నేరగాడు.

ఈ నేరానికి కారణం ఆరడుగుల నేల. చచ్చాక పూడ్చి పెట్టటానికి అవసరమయ్యేటంత జాగా. తనకి బతుకు నిచ్చింది. అది నలుగురి నడిచే దారే కావచ్చు. పేరుకు ఫుట్ పాత్ కావచ్చు. కానీ తనకు జన్మస్థలం. మెయిన్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ రోడ్డుకు తిరిగే వంపు దగ్గర ఫుట్‌పాత్ మీద తనకు సంక్రమించిన చోటు.

చేతులు చాపి అడుక్కునేది అక్కడే. కాళ్ళు చాపి పడుకునేది అక్కడే. తన తల్లి తనను కన్నదీ అక్కడే. పేరు పెట్టిందీ అక్కడే. పెంచిందీ అక్కడే. కన్ను మూసిందీ అక్కడే.

బాగా అచ్చొచ్చిన చోటు. కమల్‌హాసన్ 'గురు' సినిమా సెకండ్ షో చూసొచ్చాక తన తల్లి తనకు ఇక్కడే జన్మనిచ్చింది. అందుకే తన పేరు 'గురు'.

ఆరడుగుల పొడవూ, నాలుగడుగుల వెడల్పూ వుండే నల్లటి కంబళి ఎప్పుడూ తన జన్మస్థలం మీద పరచి వుంటుంది. దాని మీద ఒక్క రూపాయి నాణెం పడ్డా, ధగ ధగ మెరుస్తూ కనిపించి పోతుంది.

తనకు బాగా గుర్తు. తన అరేళ్ళ వయసులోనే తన తల్లి చనిపోయింది. ఇదే కంబళి మీద వున్న ఆమె శవాన్ని చూపిస్తూ తాను అడుక్కుంటున్న ప్పుడు, రూపాయిల వర్షం కురిసింది. ఈ చోటుకు వాస్తు బాగుందనే వాడు చెప్పులు కుట్టే గాబ్రియేలు తాత. తల్లి శవాన్ని బండ్లో వేసుకుపోతున్నప్పుడు, కంబళితో చుట్టమన్నారు మునిసిపాలిటీవాళ్ళు. కానీ గాబ్రియేలు తాత అందుకు ఒప్పుకోలేదు. కంబళిని కదపనివ్వలేదు. గురు చోటు పక్కనే, గాబ్రియేలుకూ ఆరడుగుల నేల వుంది. దాన్ని తాటాకు గొడుగుతో కప్పుతాడు.

గురు తల్లి తన చివరి యాత్రను మునిసిపాలిటీ బండిలోనే చేసివుండవచ్చు. కానీ అది పెళ్ళి ఊరే గింపులా సాగింది. పెళ్ళి కూతురు లాగే వుంది ఆమె అప్పుడు. అందుకు కారణం సంపంగి. సంపంగి ఎవరో కాదు. గాబ్రియేలు పెంపుడు కూతురు. తనకున్న ఎర్ర నైలాన్ చీరను శవానికి చుట్టింది. తను రాసుకునే పౌడరు పూసింది. సెంటు కూడా కొట్టింది. సంపంగికి కూడా అదే పేవ్ మెంటు మీద, గాబ్రియేలు తాత గొడుగు పక్కన ఇంకో ఆరడుగుల నేల వుంది. సంపంగికి కళ ఎక్కువ. దానిని ప్లాస్టిక్ షీట్లతోనూ, ఇనుప చువ్వల తోనూ టాపులేని గదిలా మార్చుకుంది.

ఆరోజు గురు తల్లి పోతూ, పోతూ కూడా ఆర్జించి పెట్టింది. ఆమె శవం వల్ల, ఆ పూట కంబళి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాలాగా రూపాయి బిళ్ళలతో కళ కళ లాడిపోయింది.

'బిడ్డా! నన్నొదిలినా ఈ బూదేవి నొదలకు. బువ్వకు లోటుండదు' అని తన తల్లి పోయే ముందు రోజు దీవించింది కూడా.

గురు తల్లిని పూడ్చి పెట్టివచ్చాక,గురూ, గాబ్రి యేలు తాతా, సంపంగీ – ముగ్గురూ ఒకే దుఃఖాన్ని సమానంగా పంచుకోవాలనుకున్నారు. అమ్మ ఆఖరి ఆర్జనతో బ్రాందీ కొనుక్కొచ్చారు. సమానం గానే తాగారు.

'మీ యమ్మే లేకపోతే.. నేనూ లేనూ.. సంపంగీ లేదురా..!' 'సెప్పులు తెగే సెంటర్రా యిది. ఈ సోటు వదలమాకురా అయ్యా!'– అని యేడిసేది. ఏ పోలీసెదవొచ్చినా.. అదే సేతులు తడిపేది. నాకూ సంపెంగిదెంతో.. నీ యమ్మా .. అంతేరా...!' అన్నాడు మద్యంతో తడిసిన తెల్ల మీసాలను దువ్వు కుంటూ గాబ్రియేలు తాత.

'అయ్యా! నువ్వట్టా అనమాకురా. నాకు ఏడు పొత్తది. ఈడమ్మే లేకపోతే... యియ్యాల నా మొకమే ఎవుడూ సూసేవోడుకాదు... 'నా మాట యినవే సెల్లే... ఈ లైటెలుగు నొదలకే...! నదరగా అగుపడతావ్'–అనేది!' అంటూ,కాటుక చెరగ కుండా కళ్ళు తుడుచుకుంది సంపంగి.

నిజమే! ఫుట్ పాత్ ఆ ముగ్గురికీ 'ఫుడ్' పాత్! గురుకి కంబళి మీద కూర్చుంటే చాలు కడుపు నిండి పోయేది. రైలు దిగి ఆటోలోనో, కార్లోనో వెళ్ళిపో తున్న వారు ఆగి, తాము తినగా మిగిలిన ఆహార పొట్లాలను తన మీద విసరి వెళ్ళేవారు. రోజుకు డజను తెగిన చెప్పులన్నా గాబ్రియేల్ తాత చేతుల్లో పడేవి. కనీసం ఒక గ్యాంగ్ కూలీయో, ఆటో డ్రైవరో కన్ను గీటి, సంపంగి పర్సు నింపేవాడు. అన్ని ఫుట్ పాత్‌లకీ ఈ లక్ష్మీ కళ వుండదు. రైల్వే స్టేషన్‌కు దగ్గ రగా రోడ్డు వొంపులో వుంది కాబట్టి ఈ బతుకు.

తాగినప్పుడు ఈ ముగ్గురికీ ఏదీ దాగదు. కృతజ్ఞత కూడా. అందుకే 'అమ్మ మాట అన్నం మూట కదా' అని ముచ్చట పడుతూ ఆ రాత్రి తలచుకున్నారు.

***

గురు ప్రయాణిస్తున్న పోలీస్ వ్యాన్... పెద్ద స్పీడ్ బ్రేకర్ ఎక్కిందో ఏమో... ఓ పెద్ద కుదుపు.

ఎదురుగా వున్న పరమహంస శవం ఎగిరి పడింది.

***

ఇలాగే గురు మీద ఎగిరి పడ్డాడు – పోలీసు కానిస్టేబుల్ పరమ హంస.

సెకండ్ షో సినిమా అయ్యాక, కంబళి మీద జనం వేసిన పైసలు లెక్కపెట్టుకుంటుంటే వచ్చి,

'ఇక్కడ్నుంచి లేరా!... కొడకా! ఇదేమన్నా నీ బాబుగారి ఆస్తి అనుకుంటున్నావా?' అని లాఠీ ఎత్తబోయాడు పరమహంస.

చిత్రం! తన మీద ఎత్తిన లాఠీ వణుకుతోంది. అప్పటికే పరమహంస బాగా తాగి వున్నాడు. ఎక్కడో అడుక్కుని వుంటాడు. తనకీ పరమహంసకీ ఒక్కటే తేడా. తాను అడుక్కుని తింటాడు. కొను క్కుని తాగుతాడు (సారా ఎవడూ భిక్షగా పోయడు కదా!) కానీ, పరమహంస అలా కాదు. అడుక్కునే తింటాడు. అడుక్కొనే తాగుతాడు.

తాను దండం పెట్టి, కంబళి తీసుకుని పక్కకు తొలగిపోయాడు.

'ఫుట్ పాత్ ఈడి బాబుగాడిదనుకుంటాడు... ఎదవ.. ఎదవని...!' అని ఊగుతూ, తిడుతూ; తిడుతూ ఊగుతూ, పక్కనే తాటాకు గొడుగు కింద నిద్రపోతున్న గాబ్రియేలు ముఖం మీద బూటు కాలుతో తన్ని కింద పడిపోయాడు. తాత ఉలిక్కి పడి లేచి, పడిపోయిన కానిస్టేబుల్ పరమహం సను చేతులు పట్టుకుని లేవదీయబోయాడు.

'జాతి తక్కువ నా కొడకా! నన్నే తోస్తావా!' అని తనకు తానుగా తూలుతూ లేచి, 'ఈ ఫుట్ పాతే మన్నా నీ పేటనుకుంటున్నావా' అని గొడుగు విసి రేసి మరో మారు బూటు కాలుతో తన్నబోయాడు.

తెల్ల మీసాల గాబ్రియేలు తాత తన అనుభ వంలో ఇలాంటి బూటు కాళ్ళను ఎన్నింటిని చూసి వున్నాడేమో, చటుక్కున పరమహంస కాలు పట్టే సుకున్నాడు. 'ఇంత మాసిపోయాయేటి సామి.. బూట్లు!' అని వాటిని తన ఒళ్ళో పెట్టుకున్నాడు. పక్కనే వున్న బ్రష్ తీసుకుని పాలిష్ చేశాడు. నిజం గానే విద్యుత్ కాంతిలో మెరిసాయి.

కానీ ఈ మెరుపును చూడలేదు పరమహంస. అప్పుడే ఆటో దిగి, వాడి దగ్గర పైసలు తీసుకుం టున్న సంపంగి ఒంటి మెరుపును చూశాడు.

గాబ్రియేల్ తాతను వదిలేసి, ఆమె దగ్గరకు వెళ్ళాడు పరమహంస.

'ఏంటే! ఆటో ఎక్కితే వాడికి నువ్వు డబ్బులి వ్వాలి కానీ, వాడు నీకివ్వటమేమిటి? అంటే ఫుట్

పాత్‌నేరెడ్ లైట్ ఏరియా చేసే సేవా?' అని సంపంగి నడుము మీద చెయ్యి వేశాడు.

పరమహంసను విసుగ్గా వదిలించుకుని తన చేతిలో వున్న యాభయి రూపాయిల నోటూ, అతడి చేతిలో పెట్టింది.

అయినా సంతృప్తి చెందక ఫుట్ పాత్ మీద సంపంగి గూడును కూల్చేసి, అదే ఆటోలో ఆమెను ఎక్కించుకు వెళ్ళిపోయాడు.

పరమహంస అలా వెళ్ళగానే, తాను ఇలా వచ్చి కంబళి పరిచేశాడు గురు.

విసిరేసిన గొడుగును తెచ్చుకుని పడుకున్నాడు గ్యాబ్రియేలు తాత.

గంటలోనే తిరిగి వచ్చి గూడు సర్దుకుంది సంపంగి.

వారం గడిచిపోయాక, ఒక రోజు తెల్లవారు ఝామున కంబళితో ముసుగుతన్నిన గురుని లాఠీతో కొట్టి లేపాడు పరమహంస.

ఏ అనాధకయినా, నిద్రను మించిన నెచ్చెలి వుండదు.

పరమహంస అంత పాశవికంగా నిద్ర లేపేస రికి, కౌగిట్లోని ప్రియురాలిని ఎవరో లేపుకుపోయి నట్లే ఫీలయ్యాడు తను.

వచ్చింది పరమహంస-అని పోల్చుకునే లోపుగా నే..గురు తన నోటికి వచ్చిన పచ్చి తిట్లన్నీ తిట్టేశాడు.

అంతే.. పరమహంస తన ఎముకల్ని ఏరేశాడు.

'ఇంకొక్కసారి నిన్నిక్కడ చూశానంటే.. ఇక్కడే పాతేస్తాను' అని విరిగిన లాఠీకర్రను అవతల పారేసి, ఆమడ దూరంలో ఆపివున్న టిఫిన్ బండి దగ్గరకు వెళ్ళి, బాగా మెక్కాడు.

పోలీసు వాడి మాట కూడా అమ్మ ఆశీస్సులాగే వుంది.

ఇక్కడుంటే బతుకు ఖాయమన్నది తల్లి. ఇక్కడే వుంటే చావు తప్పదన్నాడు పరమహంస.

పరమహంస ఆదేశాల ప్రకారం లేవాలనుకు న్నాడు. కానీ తన శరీరంలో ఎముకలు నిజంగా మాయమయ్యాయో ఏమో, లేవబోయి స్పృహ తప్పి కుప్ప కూలిపోయాడు గురు.

మళ్ళీ మెలకువ వచ్చింది ప్రభుత్వాసుపత్రి వరండా మీదే. స్పృహయితే వచ్చింది కానీ, ఎదు రుగా వున్న మనిషి నీడలాగా కనిపించాడు.

నీడ చెయ్యి తన నదురు మీద పడింది. తన తల్లి స్పర్శలాగా అనిపించింది.

ఇదెలా సాధ్యం? చనిపోయిన తల్లి తిరిగి రాలేదు కదా! పోనీ తన తల్లి దగ్గరకే తాను వెళ్ళి పోయాడా?

'గురూ!' అది మగ గొంతు. కొద్ది సేపటికి, నీడ మనిషయ్యాడు. మనిషి గ్యాబ్రియేల్ తాత అయ్యాడు.

కొంచెం తేరిపార చూశాడు దూరంగా నడవ లేక నడవలేక నడచి వస్తోంది ఇంకో నీడ.

ఈ నీడయినా తల్లి అయితే బాగుండుననుకు న్నాడు. కానీ ఆ నీడ సంపంగి అయ్యింది. ప్లాస్టిక్ కప్పులో టీ తెచ్చి నోటికి ఇచ్చింది.

'పిన్నీ!' ఆమెను అలాగే పిలుస్తాడు. 'నీ కేమ యింది?' ఆమె నడవలేని తనాన్ని పసిగట్టి అడిగాడు.

'ఆడే! ఆ పోలీసు సచ్చినోడు! ననెట్టికెల్లి.. ఆరు గురు యెదవల్దగ్గర పడేశాడు. అంతా బేవార్సే... నన్ను సరే! మా అయ్యకి పాతిక జతల బూట్లుచ్చి పాలిస్ సేయించాడు... పాలిస్‌కి పైసలడిగాడని నడుమిరగ్గొట్టాడు.' అని తన చీర కొంగుతో ముఖం

# దేవుడు మనిషికి కనిపించడా?

## సందేహాలు - సమాధానాలు

**టి.పెదరాయుడు, గోపాలపట్నం, విశాఖపట్నం.**

**దేవుడు మనిషికి కనిపించడా?**

కనిపిస్తాడు. 'దైవత్వం' అనంత విశ్వమంతటినీ ఆవరించుకుని ఉంది. ఇందుగలడందులేడని సందేహము వలదు ఎందెందు వెదకినా అందందే గలడన్నది పోతన వంటి కవులు చెప్పిన సత్యమే. మనుషులు తమ తమ నమ్మకాలకు అనుగుణంగా దేవుణ్ణి వివిధ రూపాల్లో కొలుస్తున్నారు. ఆత్మజ్ఞానంతో పొరుగువారిలో దైవాన్ని దర్శించమని సకల మతాలు నిత్యం బోధిస్తున్నాయి. 84 లక్షల జీవరాసులున్న ఈ అనంత సృష్టిలోని ప్రతిజీవరాశిలో, చెట్టు-పుట్టలో దైవత్వం నిబిడీకృతమై ఉండటమే ఈ సృష్టిలో ఉన్న రహస్యం. మన ఆత్మే దైవ నిలయం. కాంతిని నిక్షిప్తం చేసుకున్న ఆత్మే (దీపం) ఆనంద నిలయం. ఆ దైవత్వాన్ని తుదిశ్వాస వరకూ కాపాడుకున్న వారే దైవాంశ సంభూతులు. ఈ ప్రకృతి సహజసిద్ధంగా మనకు సంక్రమింపజేసిన సద్గుణాలను, దైవత్వాన్ని పోగొట్టుకున్ననాడు మనం దానవులమే అవుతాం. ఈ సద్గుణాలను కాపాడుకుంటూ తుదిశ్వాసలో ఈ జీవాత్మను పరమాత్మలో విలీనం చేసి మోక్షం పొందటానికి మనం ఆలోచనాశక్తి ఉన్నంత కాలం సాధన చేయాలి. సాటి మనిషిని, సాటి జీవిని కాపాడటం, వారికి సాయం చేయడం, సద్భావనతో ధర్మ రక్షణకు కృషి చేయడం, సహృదయంతో శాంతి భావనతో సంఘజీవనాన్ని కొనసాగించడమే దైవత్వం. కష్టాల్లో ఉన్న ప్రతి మనిషినీ కాపాడేందుకు సాటి మనిషి రూపంలో లేదా సహాయం రూపంలో దైవం సాక్షాత్కరిస్తుంది. పొరుగువారికి సాయం చేయడం, దానం చేయడం, సత్కార్యాలు చేయడాన్నే దైవత్వంగా భావించాలి. ఆటంబాంబు కనుగొన్న మహోన్నత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ కూడా అనంతమైన శక్తినే దైవశక్తి అని చెప్పారు. దైవం శక్తి రూపంలో ఉంటుంది. అందుకే శక్తి అనంతమైనదన్నారు. ఈ శక్తిని మనిషి అందరికీ సమానంగా వినియోగించేందుకు ఇరుగుపొరుగు సాయం కావాలి. అదే దైవత్వం. కష్టాలలో ఉన్న సమయంలో ఒకరినొకరు కాపాడుకోవడంలోనే దైవం సాక్షాత్కరిస్తుంది. ఈ విశ్వమంతా ఆవరించియున్న 'ఈశ్'కు ఒక రూపాన్ని, ఒక నామాన్ని మనం ఆపాదించి బంధించలేమని హిందూ మతం స్పష్టం చేసింది. అనంతకోటి జీవరాశుల్లో దైవత్వముందన్న పరమ సత్యాన్ని గ్రహించిన మహనీయులు ప్రతి జీవరాశిలోనూ దానిని దర్శించి ధన్యులయ్యారు. 'అహం బ్రహ్మోస్మి' అన్నారు.

**కొలచన ఆత్మారాం, తాడేపల్లిగూడెం**

**దైవ విగ్రహాలకు విలువైన ఆభరణాలు మాత్రమే ఇవ్వాలా ?**

ఆ సర్వాంతర్యామి తను సృష్టించిన సకల చరాచరాల నుండి దేనినీ ఆశించడు. నిత్య పూజా విధానంలో ఎప్పుడూ పూలూ,పంచదార,బెల్లమే దేవునికి వుడతా భక్తిగా నైవేద్యం పెడతాం. లోతుగా చెప్పాలంటే సనాతన కాలంలో విగ్రహారాధన లేదు. ఆర్యులు పంచ భూతాలను ఆరాధించారు. మన ఉనికిని గుర్తించగల-మనిషితో మమేకం కాగల సకల చరాచరాలను దైవంగా పూజిస్తారు ద్రవిడులు. దీనిని జీవ వైవిధ్య రక్షణగా, ప్రకృతి సమతుల్యాన్ని కాపాడే పవిత్ర కర్తవ్యంగా భావించాలి. మత జీవనాన్ని ఏకాగ్రతతో కూడిన ఒక శాశ్వత నిత్య ప్రక్రియగా రూపొందించే క్రమంలో భాగంగా దేవాలయాలు (ఇందుకు అనేక వాదనలు ఉండవచ్చు) ఏర్పడ్డాయి. ప్రకృతిలో లభించిన ఫలం,పుష్పం, పత్రం, తోయం, భూమి మొదలుకొని పుత్తడి, వజ్ర వైఢూర్యాలు వంటి మనిషికి లభించిన అమూల్యమైనవన్నీ మొదట దేవునికే చెందాలని భావించారు. చాలా మంది రాజులు తమ సంపద ఏదైనా దేవాలయాలకే అర్పించారు. అలా చెందిన వాటిని దీనులు, పేదల సముద్ధరణకు వినియోగిస్తున్నారు. ఆ పరంపరే నేటికీ కొనసాగుతున్నది. అయితే దేవునికి సమర్పించిన ఆభరణాలు ఎంత పురాతనమైనవో దానికి అనుగుణంగా ఆ దేవాలయ పురాతన చరిత్రను తెలుసుకోవడానికీ వీలు కలుగుతుంది. ఐతే ఆర్థిక వ్యవస్థ విస్తరించి దేవస్థానాలు ఏర్పడిన తర్వాత దేవుని మాన్యాలు, దేవుని ఆస్తీ ఏర్పడ్డాక పేదల పోషణార్థం వాటిని కాపాడవల్సిన పవిత్ర బాధ్యత ధర్మకర్తలు ఎవరైతే వారిదే బాధ్యత.

మీ సందేహాలకు సమాధానాలు ఆశిస్తే మీరడగదల్చుకున్న ప్రశ్నలను కార్డుపై రాసి కింది చిరునామాకు పంపండి

సందేహాలు-సమాధానాలు, నవ్యవీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, అశ్వనీ లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500033

మీద కారుతున్న చెమట్లను తుడుచుకుంది.

గాబ్రియేల్ తాతకు ఏదో ఆలోచనొచ్చినట్లుంది. గురు నుదుటి మీద చెయ్యి తీసేశాడు. 'గురూ! ఈ పోలీసోడు మనల్ని ఈడుంటే బతకనిచ్చేలాగ లేడు... ఏరే సోటకి పోతేనో..?'

ఈ మాటకు ఓపిక ఎక్కడనుంచి వచ్చిందో ఒక్క సారిగా లేచి కూర్చున్నాడు గురు.

సంపంగి గిరుక్కున తిరిగింది.

'సెస్..! ఫుట్‌పాత్ దిగామా? సచ్చామే! ఈడమ్మ ఎప్పుడో తేల్చేసింది. అయ్యా! నువ్వేడనుంచొచ్చావ్..! నీ ఊళ్ళో అరెకరం సెక్కా ఎస్సీజెడ్‌లో కలిపేత్తేనే కదా! నా యమ్మ నన్ను పుట్టగానే పదిరూపాయలక మ్మేద్దామని ఈడకెందుకు తెచ్చింది? పాజెక్టు గంగలో దానిల్లు మునిగిపోతేనే కదా! నన్నమ్ముకోలేక అదే వొదిలి పోయింది. మీరో ముద్దా, మీరో ముద్దా పెడితే తిన్నా.. నా బతుకు దెరువు నేను సూసుకున్నా..' అని సంపంగి ఇంకా ఏదో చెప్పబోతోంది.

ఈ రహస్యాలన్నీ గాబ్రియేల్ తాతకు తెలియ నివి కావు.

'సంపంగే! ఇవన్నీ నాకు తెలవని వేంటే? గురు మాత్రం సుకంగా అడవి నీడన పెరగాల్సినోడు కాడా..? అడవిని తవ్వి పోత్తన్నారని ముందే తెలిసి ఉరేసుకున్నాడు. ఈడు కడుపుతోటుండగానే కదా.. ఈడమ్మ రైలెకొచ్చేసిందీ..?' అన్నాడు.

'తాత! ఓనాడు బూదేవే మనల్నొదిలేసింది. ఇయ్యాల మనమే బూదేవినొదిలేద్దామా?' గురు వేసిన ప్రశ్నకు ఇద్దరూ మౌనంలోకి వెళ్ళిపోయారు.

అడవిలో పుట్టిన వాడికి, అడవే భృతి: అడవే చితి.

యేటివొడ్డున వున్న వాడికి, గంగే ఉపాధి: గంగే సమాధి.

ఈ ఫుట్‌పాత్ అలాంటిదే. దిగితే, బతక లేరు, చావలేరు.

గురుకి మాత్రం తలలో ఒక్కసారి నొప్పి పుట్టింది.

తన నుదుటి మీద రెండు చేతులూ పెట్టుకుంటే, పెద్ద కట్టు తగిలింది. అప్పుడు కానీ తెలియలేదు-త లకేదో తగిలిందని. పరమహంస కొట్టింది ఒంటి మీదకదా.. తలకెలా తగిలింది..? 'ఆ ఎదవ ఎల్తా, ఎల్తా నీ బుర్ర బద్దలు గొట్టాడ్లే..!' అని గాబ్రియేలు తాత గురు నోటికి బీడీ అందించి, వెలిగించాడు.

గురు బీడీ కాల్చాడు. పీల్చాడు. పొగలు బదులు పగలు కక్కాడు.

'అడు రైటేరా పెద్దయ్యా... పొగరుండేది తలకా యలోనే..!' అని అంటూ గుండెనిండా పీల్చుకున్న పొగను శూన్యంలోకి వదిలాడు గురు.

***

ఈ సారి పోలీసు వ్యాన్ కుదుపు కుదప కుండానే వర్తమానంలోకి వచ్చేశాడు గురు. కారణం బీడీ. బీడీ మళ్ళీ వుంటే బాగుండేది. చిన్న కోరికే..! వెనువెంటనే దిగులు..! ఛీ..ఛీ.. కోరికే దిగులు! తన తృప్తిని నాశనం చేసే దిగులు!

అందుకే, ఆనందాన్ని తిరిగి తెచ్చుకోవటం కోసం పరమహంస శవం మీద దృష్టి సారించాడు.

ప్రయాణపు తూగుకి, చీకట్లో అది ఊగుతోంది. తల భాగం కూడా ఊగుతోంది. 'ఈడి తలకాయ లోనూ పొగరే వుంటాదా..?' అనుమానపడ్డాడు. అయితే తాను కూడా వాడి పుర్రెను బద్దలు కొట్టా ల్సింది. కానీ ఈ పుర్రెనే మిగిల్చి, ముఖాన్ని పచ్చడి చేశాడు. బేవార్సుగా తాగితాగి ఉబ్బిన ముఖం... ఫుట్ పాత్ కింద, టిఫిన్ బండి వాడి దగ్గర తిని బలి సిన ముఖం... వాడి ముఖానికి అన్నీ వున్నాయి... మీసాలు కూడా! లేనిది ఒక్కటే... సిగ్గు!సిగ్గులేని ముఖం చూశాక తనకి వొళ్ళు తెలీలేదు...!

***

చివరి సారిగి ఈ సిగ్గుమాలిన ముఖంతోనే వచ్చాడు కానిస్టేబుల్ పరమహంస.

అప్పుడు గురుకి పండగ నడుస్తోంది.

వారం రోజుల చాలీ చాలని చప్పచప్పని పెరు గన్నం తర్వాత.. తన చేతుల్లోకి కోడి పలావు ప్యాకెట్..!

అది కూడా విప్పని, ఎంగిలి చేయని పొట్లాం. తినలేక పోయిన దాత కాదు... తినటానికి బద్దకిం చిన 'పుణ్యాత్ముడె'వడో విసిరాడు.

తన బతుకులోనే తొలిసారిగా ఎంగిలి చేయని భోజనం చేయబోతున్నాడు. పొందిగ్గా బాసంపట్టు వేసుకొని, తన నల్లని పళ్ళతో మెరిసే ప్యాకెట్‌ను కొరికి, గుప్పున వచ్చిన మసాలా వాసనను పీల్చాడు. పైన కనిపిస్తున్న చికెన్ ముక్కను తీసి నోట్లో పెట్టుకోబోయాడు.

'పెంటనాకొడకా...! సిగ్గూ, ఎగ్గూ లేదేంట్రా...!' లాఠీతో తన భుజాల మీద పలకరించాడు పరమ హంస. ఉలిక్కిపడ్డాడు కానీ, జారిపోబోయిన పలావు ప్యాకెట్టును ఒడుపుగా పట్టుకుని, తలపైకెత్తి చూశాడు. పరమ అసహ్యకరమైన పరమహంస ముఖం.

చేతులు ఖాళీగా లేక పోవటం వల్ల, పలావు ప్యాకెట్టుతోనే దండం పెట్టి, తినటానికి ఉపక్రమిం చాడు. గబగబా చికెన్ ముక్కను కొరికాడు.

చప్పబడ్డ నాలుకకు జీవమొచ్చింది. జివ్వు మంది.

'నీతీ, జాతీ లేని నా కొడకా! నీ యమ్మ ఎంత మందితో పడుకుంటే పుట్టావురా...?' అంటూ లాఠీతో ఇంకొకటిచ్చాడు పరమహంస.

ఈసారి దెబ్బ కంటే, తిట్టే ఎక్కువగా గురు ఒంట్లో సలిపింది. అయినా నాలుక మీద అప్పుడే పుట్టిన రుచి ఓర్చుకునేటట్లు చేసింది.

ఒక ముద్దతీసుకుని నోట్లో పెట్టుకున్నాడు.

పరమహంస మూడో సారీ లాఠీ ఝుళిపిం చాడు. ఈ సారి గురు భరించలేక పోయాడు.

లాఠీ తన ఒంటి మీద పడలేదు. గతంలో లాగా తల మీదా పడలేదు. చేతిలోని పలావు మీద పడింది. అది రోడ్డు మీద చెల్లా చెదురయింది. గతు కుల రోడ్డు కాస్తా, మెతుకుల రోడ్డయ్యింది.

పరమహింస నవ్వాడు. అసలే వికారంగా ఉబ్బిన ముఖం. దాని మీద ఈ నవ్వు. సిగ్గులేని ముఖమంటే అదే...!

ఆ ముఖాన్ని చూసి గురు ఉడుక్కున్నాడు. ఏడు పొచ్చింది. బావురుమని ఏడ్చేశాడు.

అమ్మను తిట్టినా రాని ఆక్రోశం, అన్నాన్ని కొడితే వచ్చేసింది.

ఉగ్రుడై లేవబోయాడు. అంతలోనే చతికిల పడ్డాడు. కారణం? తన కాళ్ళకింద కంబళిని తీసిపా రేసి బిగ్గరగా నవ్వుతున్నాడు పరమహంస. అతడి ముఖం మరింత అసహ్యంగా...

ఎగిరి ఎంగిలి చేత్తో పరమహంస ముఖం మీద కొట్టాడు. కూలిపోయాడు పరమహంస. ఫుట్ పాత్ పక్కనే వున్న బండరాయిని, రెండుచేతుల్తో ఎత్తు కుని వచ్చి అతడి గుండెల మీద కూర్చున్నాడు గురు.




## నార్నియా...రెహనుమా!

ఇండియన్ ఐడల్ విజేత శ్రీరామచంద్ర ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో కనిపిస్తు న్నాడు. ఆయన తొలి హిందీ ఆల్బమ్‌లోని 'రెహనుమా..' అంటూ సాగే పాటను 'నార్నియా' సినిమాలో వాడటం పట్ల ఈ యువ గాయకుడు హర్షాన్ని వెలిబుచ్చుతు న్నాడు. ఈ విషయాన్ని గురించి ఈ మధ్య శ్రీరామ్ మాట్లాడుతూ ''ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నార్ని యాలో నా గాత్రం వినిపించడం చాలా ఆనం దంగా ఉంది. ఆసియాకు సంబంధించినంత వరకు ఈ సినిమాలో పాట పాడిన ఏకైక గాయకుడిని నేనే! తలచుకుంటే ఆ భావన ఆనందాన్ని కలిగిస్తుంది. తెలుగు, తమిళ, హిందీల్లో ఆ పాటను నాచేత పాడించిన సోనీ సంస్థకు కృతజ్ఞతలు. ప్రధాన పాత్రకు సంబం ధించిన కీలకమైన సందర్భాల్లో నా గాత్రం వినిపిస్తుంది'' అని అన్నారు.

పరమహంస ముఖం మీద అసహ్యంతో కొట్టాడు. ఏడుస్తూ కొట్టాడు. చెల్లాచెదురయిన మెతుకులను చూస్తూ కొట్టాడు.

పరమహంస చనిపోతున్నప్పుడు ఏడ్చాడో లేదో తెలీదు కానీ, గురు మాత్రం అతణ్ణి ఏడుస్తూనే చంపాడు. ఎప్పుడూ ఏడ్వనంత ఏడుపు ఏడ్చాడు అప్పుడు. ఇక జీవితంలో ఏడ్వాల్సిన పనిలేదన్నం తగా ఏడ్చాడు. ఏడ్చి ఏడ్చి తేరుకున్నాడు. ఈ దృశ్యాన్నంతా గుమిగూడిన జనమందరితో పాటు చూసిన గాబ్రియేలు తాత లయబద్ధంగా ఈల వేశాడు. సంపంగి డ్యాన్సు చేసింది.

ఫుట్‌పాత్ మీద ఇతర బిచ్చగాళ్ళంతా పారిపో యారు. చచ్చిన కానిస్టేబుల్ పరమహంస ఖాకీ జేబుల్లో చేతులు పెడితే.. రెండు అయిదు వందల రూపాయిల నోట్లు దొరి కాయి. గాబ్రియేల్‌కు ఒకటీ, సంపంగికి ఒకటీ ఇచ్చేశాడు గురు. తన



## ఏమో చిత్రం స్పష్టంగా లేదు!

*ఆయనేమైనా*
*సర్వాంతర్యామా*
*అయితే గియితే*
*జనం గుండెల్లో ఉండాలి కాని*
*ఊరూర విగ్రహాలై ఎందుకు మొలుస్తాడు?*
*ఈయనేమైనా*
*ఆ ఆదిమధ్యాంత రహితుడికి వారసుడా*
*అయితే గియితే*
*జనం తపించాలిగాని*
*జనాదరణ కోసం ఈ జపమేమిటి?*
*ఓదార్చేవాడి ముఖంలో*
*వేనవెల్లులు వెదజల్లాలి కాని*
*ఈ అనంత దిగులు ఛాయలేమిటి?*
*లక్ష్యం 'చే' జారిందనా*
*నల్లేరు మీద నడచిన అధికార రథం ఆగి*
*పోయిందనా*
*ఏమో రాబోయే కాలంలో*
*ఎవరిని ఎవరు ఓదార్చాలో*
*చిత్రం స్పష్టంగా లేదు!*
*ఇరువైపుల వ్యూహాలు స్థిరపడటం లేదు*
*వేటకాడు నూకలు జల్లిండు*
*పావురాలు విడివిడిగా వచ్చివాలినయి*
*ఎన్నికలొస్తే తప్పా*
*పావురాలు జిక్కుతయా*
*ఏకమై వలనెత్తుకపోతాయా*
*ఏమో తెలియదు!*

**–కోట్ల వెంకటేశ్వరరెడ్డి**
**సెల్: 94402 33261**

చొక్కా జేబు తాను తడుముకుంటే రెండు బీడీలు, అగ్గిపెట్టె. వెలిగించాడు. హింసను పీల్చాడు. శాంతిని వదిలాడు.

***

వ్యాన్ ఆగింది. పోలీసులు తనని చంపటం ఖాయం. చంపే ముందు 'సివరాకరి కోరిక' అడుగు తారేమో! 'ఒక బీడీ అడుగుతాను. దమ్ము కొడుతూ సచ్చి పోతాను.' చావు తనకిప్పుడు బతుకంత పెద్ద విషయం కాదు. 'వస్తే రానీయ్ లే' అనుకున్నాడు.

వ్యాన్ తలుపులు తెరుచుకున్నాయి. ముందు పరమహంస శవాన్ని దించారు. తర్వాత తనని కిందకి విసరేస్తే ముద్దలా పడ్డాడు. అలా దొర్లించు కుంటూనే, లాకప్ వరకూ తన్నుకుంటూ వెళ్ళి లోపల వేశారు.

ఒక్కసారిగా ఆకాశానికి చిల్లు పడ్డట్లు.. నీళ్ళు.. కుంభవృష్టిలా... బకెట్ల కొద్దీ నీళ్ళు.. నీళ్ళలో సుగంధం.. 'పైకి అంపటానికి, పన్నీటి జలకాలు కామోసు' అనుకున్నాడు.

'కంపు నా కొడకా!' అని ఆఖరి బకెట్ వేసి వెళ్ళి పోయాడు స్టేషన్‌లో వున్న కానిస్టేబులొకతను.

లాకప్‌లోనుంచి బయిటకు చూశాడు. పరమ హంస శవాన్ని టేబుల్ మీద బెడ్‌షీట్ వేసి, పడుకొ బెట్టారు. దూసుకుని వచ్చాడు లాకప్‌లోపలికి-క ర్చీఫ్‌తో ముక్కు మూసుకుంటూ డీసీపీ తాండవ్. అతని వెనకాలే ఇన్స్పెక్టర్ వచ్చి గురు ఎదురుగా కుర్చీ వేస్తే కూర్చున్నాడు.

తాండవ్ గురుని కొట్టలేదు. జరిగింది చెప్పమ న్నాడంతే.

నిండా తడిసిన వాడికి చలేమిటి? పూసగుచ్చి నట్టు చెప్పాడు. తాండవ్ నమ్మాడో, లేదో తెలీదు కానీ, ఏమీ అనకుండా వెళ్ళిపోయాడు.

'ఇప్పుడు చంపుతారు కాబోలు. 'సివరాకరి కోరిక' ఏంటని అడగరా!' అని అనుకుంటూ డీసీపీ తాండవ్ వెళ్ళిన వైపు చూశాడు. పరమహంస శవం దగ్గర నిలబడి చాలా అసహనంగా తననీ, పరమ హంస శవాన్నీ ఒకేలా చూశాడు.

'సిగ్గులేదా ఈ పరమహంస గాడికి?' అన్నాడు తాండవ్.

లాకప్‌లోనుంచి ఈ మాట విన్న గురుకి కొంచెం గర్వం కలిగింది. పరమహంస ముఖంలో సిగ్గులే దని డీసీపీ కన్నా తానే ముందు కనిపెట్టాడు.

'గూండాల చేతుల్లో చావచ్చు. ఫ్యాక్షనిస్టుల చేతుల్లో చావచ్చు. ఉగ్రవాదుల చేతుల్లో చావచ్చు. గొప్పగా వుంటుంది. గౌరవంగా వుంటుంది. కానీ ఒక పోలీసు వాడు. బిచ్చగాడి చేతుల్లో చస్తాడా? చచ్చినోడికి సరే.. నాకు సిగ్గుగా వుందే..!' అంటూ, శవం వున్న టేబుల్ సొరుగు తెరిచి, రివాల్వర్ తీసాడు.

గురు వైపూ, పరమహంస శవం వైపూ మళ్ళీ అలాగే మార్చి మార్చి చూశాడు డీసీపీ.

గురు చేతులకు బంధనాలు లేవిప్పుడు.

గురు తన జేబు తడుముకున్నాడు. తడిసిన బీడీ ముక్క చచ్చినా వెలగదు.

'బీడీ కాల్చకుండానే పోతాను కాబోలు.' అను కుని కళ్ళు మూసుకున్నాడు.

రివాల్వర్ మూడు సార్లు పేలింది.

గురు కళ్ళు తెరిచాడు. తాను బతికే వున్నాడు. తాండవ్ కాల్చింది పరమహంస శవాన్ని.

'ఇతని భార్య వస్తోంది. ఉగ్రవాదుల కాల్పుల్లో పోయాడని చెప్పండి. ముందు ఏడ్చినా తర్వాత గర్వపడుతుంది.' అని తాండవ్ తన సిబ్బందికి చెప్పి, గురు వైపు చూశాడు.

'ఫో!' అన్నాడు విసుగ్గా.

కోపాన్నంతా దిగమింగుకుంటూ తాండవ్ వైపు చూశారు అక్కడ వున్న మొత్తం పోలీసు సిబ్బంది.

***

గురు తన చోటుకు తాను వచ్చాడు.

తడిసిన బట్టల్ని తనువు మీదనే అరేసుకుంటూ వచ్చాడు.

గాబ్రియేల్ తాత తల నిమిరాడు. సంపంగి తల్లిలా హత్తుకుంది.

గురు ఆనంద పడలేదు: దుఃఖపడలేదు. అన్ని కోరికలూ చచ్చిపోయాయి-బీడీ కాల్చాలన్న కోరిక కూడా.

పరమహంస విసిరేసిన చోటే, తన కంబళి పడి వుంది. జాగ్రత్తగా తీసి, తన ఆరడుగుల చోటు మీదా పరిచాడు.

ముడుచుకుని పడుకున్నాడు.. అమ్మ కడుపు లోని శిశువులా.

ఎప్పుడు నిద్రలోకి వెళ్ళాడో తెలియదు కానీ, తెలతెల వారుతుండగా చిన్న చప్పుడుతో మెలకువ వచ్చింది. కంబళి మీద ప్యాకెట్!

'ఈ బూదేవినొదలకురా కొడుకా' అని అమ్మ అన్న మాట మరో మారు గుర్తుకొచ్చింది.

కొన్ని యుగాల ఆకలి కడుపులోంచి పుట్టుకొ చ్చింది.

లేచి కూర్చొని, ఆత్రంగా ప్యాకెట్ తెరిచాడు గురు.

అది అన్నం కాదు. ఆయుధం. అవును. నల్లటి రివాల్వర్.

చేతిలో రివాల్వర్ చేతిలో వుండగానే... తన మీద తూటాల వర్షం కురిసింది.

పొగ.. కళ్ళ చుట్టూ మసక... ఎదురుగా తన మీద కాల్పులు జరుపుతున్న డీసీపీ తాండవ్!

కడుపు మీద కొట్టే వాడు గురి తప్పడు. తూటా లతో గురు కడుపు నిండిపోయింది.

గంట తర్వాత టీవీల్లో బిచ్చగాడు గురు.... ఉగ్ర వాది గురుగా దేశానికి పరిచయమయ్యాడు.

తన ఆరడుగుల నేల మీదకు టిఫిన్ బండి వచ్చింది. పట్టణంలో అన్ని ఫుట్ పాత్‌ల మీదకు బహు(ళ) వ్యాపార శాలలు ఎక్కేశాయి. శాంతి భద్రతలు చచ్చినట్లు అదుపులోకి వచ్చాయి.

*

**రచయిత సెల్ నెం: 9866192685**